

వేరుశనగ విత్తనకాయల ధర ఖరారు

40 శాతం సబ్సిడీతో పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ విత్తనకాయల అమ్మకం ధర ఖరారైంది. గతేడాది కంటే స్వల్పంగా తగ్గించి ధరను నిర్ణయించారు. గతేడాది క్వింటాళు అమ్మకం ధర రూ.9500 కాగా ఈసారి అది రూ. 9300గా నిర్ణయించారు. అమ్మకం ధరపై 40 శాతం సబ్సిడీని నిర్ణయించారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు అయితే 90 శాతం సబ్సిడీ ఉండనుంది. ఇప్పటికే విత్తన సేకరణ శుద్ధి ప్రక్రియ నడుస్తోంది. అమ్మకం ధర ఖరారు కావడంతో నిలువను బట్టి పంపిణీ తేదీలు ఖరారయ్యే అవకాశముంది.

సబ్సిడీ ధరలు : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 50592 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనకాయలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో కె-6 రకం క్వింటాళు అమ్మకం ధర రూ.9300 కాగా సబ్సిడీ రూ.3720 పోనూ అమ్మకం ధర రూ.5580 కానుంది. టిసిజిఎస్ 1694, టాగ్ 224 ధరలు కూడా ఇదే తీరు ఉంది. నారాయణి రకం మాత్రం క్వింటాళు అమ్మకం ధర రూ.9500 ఉండగా సబ్సిడీ రూ.3800 పొనూ అమ్మకం ధర రూ.5700గా నిర్ణయించారు. కదిరి-లేపాక్షి 1812 రకం క్వింటాళు ధర రూ.8200 కాగా సబ్సిడీ రూ.3280 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.4920గా ఉంది.

గరిష్టంగా మూడు బస్తాలు : వేరుశనగ విత్తనకాయల సబ్సిడీతో 30 కిలోల బస్తాలివ్వనున్నారు. ఈ మేరకు అర ఎకరంలోపు భూమి ఉన్న రైతుకు ఒక బస్తా ఇవ్వనున్నారు. అర ఎకరం కంటే ఎక్కువ ఉండి ఎకరాలోపు ఉంటే రెండు బస్తాలిస్తారు. ఒక ఎకరం కంటే ఎంత ఎక్కువ భూమి ఉన్నా గరిష్టంగా మూడు బస్తాలకే పరిమితం చేశారు.

రైతు ప్రయివేటుపై ఆధారపడక తప్పదు : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట 4.49 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఇంత విస్తీర్ణంలో పంట సాగయితే వేరుశనగ విత్తనకాయలు మూడు లక్షల క్వింటాళ్ల వరకు అవసరమవుతుంది. కాని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది కేవలం 50,592 క్వింటాళ్లు మాత్రమే . తక్కిన విత్తనాన్ని రైతు బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఎందుకంటే ఒక ఎకరంలో వేరుశనగ విత్తనం వేయాలంటే తక్కువలో తక్కువ 40 కిలోల వరకు విత్తనం అవసరమవుతుంది. ఈ లెక్కన 4.49 లక్షల ఎకరాల్లో విత్తనం వేయాలంటే 1.79 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అవసరం. దీని ప్రకారం విత్తనకాయలు మూడున్నర లక్షల క్వింటాళ్లు అయినా కావాలి. అయితే ప్రభుత్వమిస్తున్నది కేవలం 50592 క్వింటాళ్లు మాత్రమే. తక్కిన విత్తనకాయలను రైతులు బయట కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

సబ్సిడీ పెంచాలి



వేరుశనగ రైతుకు ప్రభుత్వపరంగా ప్రోత్సహం మరింత అందివ్వాలి. 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రైతు సంఘంగా ముందు నుంచి అడుగుతున్నాం. ఇప్పుడూ అదే డిమాండ్ చేస్తున్నాం. అదే విధంగా విత్తనకాయలను 90 కిలోలకు కాకుండా అవసరమైన మేరకు అందివ్వాలి. అప్పుడే రైతుకు కొంత ఊరట లభిస్తుంది. లేకపోతే పెట్టుబడులు పెరిగి రైతుపై అదనపు భారం పడే అవకాశముంది.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బలవంతపు భూసేకరణపై రైతుల్లో వ్యతిరేకత



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలగూరు గ్రామంలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ రెడ్డికి పిత్రార్జితం కింద 12 ఎకరాల భూమి ఉంది.ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటు అతని ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. ప్రస్తుతం ఉన్న భూమి మొత్తం భూసేకరణ పేరుతో ప్రభుత్వం లాక్కొనేందుకు పూనుకుంది. దీంతో చంద్రశేఖర్ రెడ్డి కుటుంబం రోడ్డున పడబోతోంది.

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలగూరు గ్రామంలో నివాసం ఉంటున్న దళిత కుటుంబానికి చెందిన నరసింహ్మప్పకు ఐదుగురు సంతానం. ఇతనికి 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో బోరు బావి ద్వారా సంవత్సరానికి మూడు పంటలు పండిస్తు జీవనం చేస్తున్నాడు. ఇప్పుడు ఈ మూడు ఎకరాలు మొత్తం ప్రభుత్వం తీసుకుంటోంది.

అదే గ్రామానికి చెందిన ఈడిగ శ్రీరాములుకు 5ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో అప్పులు చేసి వివిధ పంటలు పండించి, అమ్మగా వచ్చిన దాంతో ఇతని నలుగురు కుమార్తెలకు వివాహం చేశాడు. వివాహ సమయంలో అందిన కాటికి అప్పులు చేశాడు. తనకు ఉన్న భూమిలో వ్యవసాయం చేసి అప్పులను తీర్చుదామనుకున్నాడు. అయితే ఉన్నా ఫళంగా ప్రభుత్వం ఉన్నా భూమిని స్వాదీనం చేసుకోవడానికి సిద్ధం కావడంతో చేసిన అప్పులను ఏలా తీర్చాలో తెలియక మధన పడుతున్నాడు. ప్రభుత్వం తన భూమిని తీసుకుంటే తనకు ఆత్మహత్య శరణ్యం అంటున్నాడు. ఇలా ఒక్క చంద్రశేఖర్ రెడ్డి, దళిత నరసింహ్మప్ప, శ్రీరాములే కాదు ఎ హిందూపురం, లేపాక్షి, సోమందేపల్లి మండల పరదిలో ఉన్నా దాదాపు 8 గ్రామాలకు చెందిన 1118 చిన్న, సన్న కారు రైతుల ఆవేదనలు ఇవి.

1118 మంది రైతుల నుంచి 2191 ఎకరాల సేకరణకు రంగం సిద్ధం

బలవంతపు భూసేకరణ ఎవరి కోసం అంటున్న రైతన్నలు

రైతులతో కలిసి ఆందోళనలు తీవ్రం చేస్తామంటున్న రైతు సంఘం నాయకులు

ప్రభుత్వం హిందూపురంలో బలవంతపు భూసేకరణకు శ్రీకారం చుట్టింది. హిందూపురం రూరల్ మండలం మలగూరు రెవెన్యూ పొలం పరిధిలో ఉన్న మలగూరు, చలివెందుల, రాచపల్లి, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 1118 మంది రైతులకు చెందిన 2191 ఎకరాల భూమిని భూ సేకరణ చట్టం ద్వారా సేకరించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ భూమిని దేని కోసం సేకరిస్తున్నారు, ఎవరి కోసం సేకరిస్తున్నారన్న విషయాలను భూసేకరణ చట్టం అనుసరించి రెవిన్యూ అధికారులు గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతులకు వివరించాల్సి ఉంది. ప్రభుత్వం చెప్పిన వెంటనే అధికారులు నిబందనలకు పాతర వేసి భూసేకరణకు సిద్ధం అయ్యారు. సంవత్సరానికి మూడు పంటలు పండించే భూములను ప్రభుత్వం భూ సేకరణ చట్టం అనే అస్త్రాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమైంది. ఈ భూసేకరణ అంబాని కోసమా...?, ఆదాని కోసమా...? అన్నది అర్థం కావడం లేదు. ప్రభుత్వం చెప్పింది, తాము భూమిని సేకరిస్తున్నామంటూ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే హిందూపురం నియోజక వర్గంలో వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే ఇప్పటి వరకు సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. భూములు ఇచ్చిన రైతులు రోడ్డు పాలయ్యారు. భూములన్ని బీడు భూములుగా మారాయి. ఈ నేపథ్యంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించడానికి రైతు సంఘాల నాయకులు సిద్ధమవుతున్నారు.

పేదల దరిచేరని 2013 భూసేకరణ చట్టం

బ్రిటిష్ వాళ్లు రూపొందించిన భూ సేకరణ చట్టం 'ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్-1894' కి మనకు స్వాతంత్ర్యం సిద్ధించాక రెండు మూడు చిన్న సవరణలు జరిగినప్పటికీ 'భూసేకరణ చట్టం-2013' వచ్చే వరకు దాదాపు 120 సంవత్సరాలు అదే అమల్లో ఉంది. ఈ భూసంతర్పణను వ్యతిరేకిస్తూ చాలా ఏళ్ళ నుంచి ఎందరో శాసనకర్తలు, న్యాయాధీశులు, రైతు సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు విజ్ఞప్తులు చేశాయి. ఇంకా సమకాలీన అవసరాల దృష్ట్యా గత యూపీఏ ప్రభుత్వం రెండవ సారి ఎన్నికైన తర్వాత అంటే 2013లో కొత్త భూ సేకరణ చట్టం రూపుదిద్దుకుంది. ఈ కొత్త చట్టానికి హక్కు అనే పదం జోడించి 'భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం, న్యాయమైన పరిహారం, పారదర్శకత 2013 చట్టం'గా తయారు చేసారు. ఇది జనవరి 2014 నుంచి అమలు పరిచేలా కేంద్రం నిర్ణయించింది. ఈ చట్టాన్ని రూపొందించి 12 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అది పేదల దరిచేరలేదు. ప్రభుత్వం పేదల బాధలను వినకుండానే చట్టాన్ని చుట్టంగా మార్చుకుని భూములను సేకరిస్తోంది.

రైతులతో కలిసి ఉద్యమిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణకు వ్యతిరేకంగా పంజాబ్ రైతులు చేసిన ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమిస్తాం. ఏడాదికి మూడు పంటలు పండే 2191 ఎకరాల భూమిని భూ యజమానులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా తీసుకుంటున్నారు. భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూమిని సేకరించాలంటే గ్రామాల్లో రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి, సేకరించిన భూముల్లో ఫలానా పరిశ్రమలు వస్తున్నాయని వివరించి, రైతులకు ఇష్టముంటేనే భూమిని సేకరించాలి. చట్టాలను ఉల్లంఘించి బలవంతపు భూసేకరణ చేయడం ఎంతవరకు న్యాయం.

సిద్దారెడ్డి,
రైతు సంఘం నాయకులు

కల్లూరు సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, హిందూపురం మాజీ శాసన సభ్యులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతకల్లూరు సుబ్బారావు 128 జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరా పార్కులో ఉన్నా ఆయన విగ్రహానికి పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు సేవా సంఘం సభ్యులు, కల్లూరు సుబ్బారావు కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతు కల్లూరు సుబ్బారావు దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు చేసిన సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అధికారికంగా జయంతి, వర్ధంతిలను జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మనవళ్లు ఆదినారాయణ రావు, కవి, రచయిత కల్లూరు రాఘవేంద్ర రావు, అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో : పద్మశ్రీ అవార్డు గ్రహీత కల్లూరు సుబ్బారావు 128 జయంతి వేడుకలను లేపాక్షి మండల వైసిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలో ఉన్నా కల్లూరు సుబ్బావిగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్ నిసార్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, లైఫ్ వరల్డ్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, రామాంజనేయులు, శ్యాం ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా అందించే డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పిడి సుదర్శన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులైతే కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. ఐదెకరాలు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, పదెకరాలు ఉన్న రైతులకు 90 శాతం, ఆపై ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. స్ప్రింక్లర్లు మాత్రమే కావాల్సిన రైతులు(అన్ని కులాల వారికి) 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఫీల్డ్ సర్వే అయిన వెంటనే రైతులకు ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా సరఫరా చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రం, లేదా డివిజినల్ ఎంఐఎఓలను సంప్రదించాలన్నారు.

మంత్రి చొరవతో ప్రభుత్వాసుపత్రికి నిధులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా రూ. 13.5 లక్షల నిధులు మంజూరు చేయించారని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఆసుపత్రిలో అంతర్గత తారు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తారన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రజల కోసం ఆసుపత్రిలో నూతన భవన నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరు చేయించిన మంత్రి, ఇప్పుడు వంద పడకలు ఉన్న ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా ఆధునీకరించడంతో పాటు, కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం 10 పడకల డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయించారన్నారు.

'మాజీ ఎంపీ మాధవ్ ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి-చిలమత్తూరు

దళిత నాయకులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజుపై మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. మాధవ్ ఎమ్మెల్యే రాజుపై అసత్య ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం నిర్విరామంగా పోరాటాలు చేసిన ఎంఎస్.రాజు మాటతీరు అందరికీ తెలుసు అన్నారు. అనంతపురం నగరంలోని జడ్పీ కార్యాలయంలో మాజీ సిఎం జగన్ చిత్రపటాన్ని తీసేయమనడం, ప్రస్తుత సిఎం చంద్రబాబు చిత్రపటాన్ని పెట్టమనడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఫొటోను అడ్డుపెట్టుకొని దానిని బిసి కులాలకు ఆపాదించి మాట్లాడాడని ఎమ్మెల్యే మాటలను వక్రీకరించి పోలీసులకు ఫిర్యాదు చేయడం మాధవ్‌కే చెల్లిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం చట్టాల ఉల్లంఘనకు పాల్పడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కొలిక్కి వచ్చిన యువ న్యాయవాది హత్య కేసు....

ప్రజాశక్తి-హిందూపురం

గత ఏడాది మే 29న జరిగిన ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్ కుమార్ హత్యకేసు కొలిక్కి వచ్చింది. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినటుల డీఎస్పీ కెవి. మహేష్ తెలిపారు. ఈ కేసుకు సంబందించిన వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. యువ న్యాయవాది సంపత్ కుమార్ హత్య కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇందులో ప్రధాన నిందితులుగా ఉంటూ ఏడాదికాలంగా అజ్ఞాతంలో ఉన్న తండ్రీ కొడుకులు నాగార్జున రెడ్డి, కృష్ణారెడ్డి ఇద్దరు న్యాయవాదులు కావడంతో పలుమార్లు సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్లు, హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేయడంతో పాటు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఏడాదికాలంగా అజ్ఞాతంలో ఉన్న ఈ కేసులోని రెండవ నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. మొదటి నిందితుడు కృష్ణారెడ్డి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మొదట నిందితుడు లొంగిపోయాడని డిఎస్పి వివరించారు. దీంతో కృష్ణారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ పంపించామన్నారు. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైన చట్టం దృష్టిలో ఎప్పటికీ తప్పించుకోలేరని, అందుకు ఈ కేసు నిదర్శనమని అన్నారు. సంపత్ కుమార్ హత్య కేసు కొలిక్కి రావడమే కాకుండా ఏడాదికాలంగా అజ్ఞాతంలో ఉన్న ప్రధాన నిందితులను బయటకు రప్పించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడానికి కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పి అభినందించినట్లు డిఎస్పి తెలిపారు.

ఏడుగురు నిందితుల అరెస్టు

డిఎస్‌పి కె వి మహేష్

పండ్లతోటల సాగుకు ముందుకు రండి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎర్ర నేలలు అధిక శాతంలో ఉన్నందున పండ్ల మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని అందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో గత పది ఏళ్లుగా అతివృష్టి అనావృష్టి వల్ల తరచూ రైతులు పంటలు పెట్టి నష్టపోతునే ఉన్నారు. ప్రధానంగా వేరుశనగ పంటపై ఆధారపడడం వల్ల వర్షాభావ పరిస్థితులతో ఏటా పంటలు దెబ్బ తినడం తద్వారా అప్పులు పెరిగిపోవడం అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడడం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో వ్యవసాయం చివరకు ఒక జూదంలా మారిపోయింది. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా పంటల మార్పిడి వల్ల కొంతమేర రైతులకు ఉపయోగమని వ్యవసాయ ఉద్యానవన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం కూడా అనేక రాయితీలు ఇస్తోంది. ముఖ్యంగా జిల్లాలో ఇటీవల పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. అందుకు అనుకూలంగా డ్రిప్పు, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. తక్కువ తడులతో నీరు వృథా కాకుండా ఈ పరికరాలు ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో పండ్ల తోటలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, రాయితీల ప్రోత్సాహం తదితర అంశాలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.



ప్రశ్న: జిల్లాలో ఏయే పండ్ల మొక్కల పెంపకం చేపట్టవచ్చు? ప్రస్తుతం సాగు విస్తీర్ణం ఎంత?

జవాబు : జిల్లాలో ఎక్కువ శాతం ఎర్ర నేలలు ఉండడంతో పండ్లతోటల పెంపకానికి అనుకూలంగా ఉంది. మామిడి, చీని, దానిమ్మ, సపోటా, అరటి, బొప్పాయి, ద్రాక్ష, అంజూర పండ్ల మొక్కలు పెంచుకోవచ్చు. కాయలు వచ్చేవరకు పంటల మధ్య అంతర్ పంటలు కూడా సాగు చేయవచ్చు. జిల్లాలో మొత్తం 1699.22 హెక్టార్లలో పండ్ల మొక్కలు పెంపకం లక్ష్యం కాగా ఇప్పటివరకు 1579.50 హెక్టార్లలో పెంపకం జరుగుతోంది.1524 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: నీటి వనరులు కల్పించడానికి చేపడుతున్న చర్యలు ఏమిటి?

జ: ప్రభుత్వం అనేక పథకాల ద్వారా నీటి వనరులు పెంపొందించేందుకు తగిన సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో ఒకటైన డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తమ శాఖ ద్వారా చిన్నపాటి కుంటలు, ఫారం ఫండ్స్ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఫారం ఫండ్స్ లక్ష్యం 33 చోట్ల కాగా రూ. 82.5 లక్షలతో ఆ 33 చోట్ల ఫారం ఫండ్స్ నిర్మించడం జరిగింది. దీంతో 33 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర : మీ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు ఏమిటి?

జ : జిల్లాలో పండ్ల తోటల విస్తరణ అనంతరం రెండు మూడు సంవత్సరాల తర్వాత రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుంది. నీటి వనరుల ఏర్పాటుకు తగు చర్యలు చేపడుతున్నాం. పండ్ల కోతలు అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు వివరిస్తున్నాం. అందులో భాగంగానే రైతులకు తగిన శిక్షణను కూడా ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి అందే డ్రిప్పు, స్పింక్లర్ల గురించి, అవి వాడే విధానం గురించి వివరిస్తాం. సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ సబ్సిడీలు కూడా అందిస్తాం.

ప్ర : జిల్లాలో ఎంత మంది రైతులకు లబ్ధి చేకూరింది?

జ : జిల్లాలో పండ్ల తోటల పెంపకం ఇతర సదుపాయాలు ద్వారా 5100 మంది రైతులు లబ్ధి పొందారు. ఆర్థికంగా రూ.564.53 లక్షలు వివిధ రకాలుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. అలాగే హైబ్రిడ్ కూరగాయల పంటల ద్వారా కూడా రైతులు లబ్ధి పొందుతున్నారు.

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పండ్ల తోటల రైతులకు ఎంతో ఉపయోగం. కొత్తగా ఉద్యానవన పంటలు పెట్టే వారికి గుంతలు తవ్వుకోవడానికి ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి ఉద్యానవన మొక్కలు నాటుకుంటే రాబోయే జూన్, జూలైలో కురిసే వర్షాలు రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఒకే రకమైన పంటలు ద్వారా కాకుండా పండ్ల మొక్కలు పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలి. కొన్ని మొక్కలకు రెండు మూడు రోజులకు ఒకసారి మరికొన్ని మొక్కలకు వారానికి ఒకసారి నీటి తడులు అందించే విధంగా ఉంటాయి. రైతులు నీటి లభ్యతను బట్టి పెంచుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు అయితే 90 శాతం సబ్సిడీతో ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీతో పరికరాలు అందించడం జరుగుతుంది. చెట్లు తెగుళ్ల బారిన పడకుండా నూతన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ అభివృద్ధి చెందాలి.



జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ అభివృద్ధికోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తించి వారికి న్యాయం చేస్తుందని వైసిపి నాయకులు వేణురెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో లేపాక్షి మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతు కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో అన్ని పంచాయితీల్లో వైసిపి జెండాను ఎగర వేయాలన్నారు. దీని కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ నిసార్ అహ్మద్, వైస్ ఎంపీపీ అంజన రెడ్డి, కో-ఆప్షన్ నెంబర్ బషీర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మానంపల్లి రామాంజనేయులు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ రమేష్ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గం అధ్యక్షులు శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తాం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు అన్నారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాజకీయంగా సమాధి అయిన వైసిపికి చెందిన నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసి, తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి వద్ద మెప్పు పొందాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా జగన్ ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తామని అన్నారు. తామెక్కడా జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మను అవమానించలేదన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ కూర్చొనే కార్యాలయం ప్రభుత్వ కార్యాలయమని అక్కడ జగన్‌ఫొటో ఉండటంపై సిఇఒను నిలదీస్తే వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు తప్పుగా అనిపించిందా అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ రంగయ్యకు పార్టీ కార్యాలయానికి, ప్రభుత్వ కార్యాలయానికి తేడా తెలియదా అని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా జగన్ ఫోటోలు ఉంటే దానికి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని మొదటి క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి, ప్రభుత్వ కార్యాలయాలకు నోట్ పంపిస్తే అమలు చేయాల్సిన బాధ్యత జెడ్పీ సీఈఓకు ఉండదా? అని నిలదీశారు. జెడ్పీ కార్యాలయంలో ఏం జరిగిందో మరోసారి పరిశీలించి మాట్లాడాలని హితవు పలికారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంఎస్.రాజు

ప్రజాశక్తి www.prajasakti.com



తెలుగు యువత చేపట్టిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

సైకిల్ ర్యాలీగా మహానాడుకు తరలిన తెలుగు యువత

ప్రజాశక్తి-పెనుకొండ

కడప నగరంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ 44వ మహానాడులో పాల్గొనేందుకు తెలుగు యువత ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. సైకిల్ ర్యాలీని ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద మంత్రి సవిత జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి సైకిల్ తొక్కుతుంటూ జాతీయ రహదారి వరకూ ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ తరఫున 44 మంది పార్టీ యువత పెనుకొండ నుంచి కడపకు సైకిల్ ర్యాలీగా బయల్దేరి వెళ్లారన్నారు. మహానాడు దిగ్విజయం కావాలని ఆకాంక్షిస్తూ యువత ఈ ర్యాలీ చేపట్టారన్నారు. పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు సారథ్యంలో నిర్వహించే మహానాడుకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. మహానాడులో నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపేలా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి శ్రేణులు, అభిమానులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున తరలి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రీవెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని, ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరకు అర్జీలు తీసుకుంటారన్నారు. ఆయా అర్జీలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులకు పంపిస్తారన్నారు.



వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మహాలక్ష్మిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా మహాలక్ష్మి

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కొత్తచెరువు మాజీ జడ్పిటిసి ఎం.మహాలక్ష్మి నియమితులయ్యారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత జగన్, సహకారం అందించిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపిని బలోపేతం చేసేందుకు, మహిళా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం వారి నివాసంలో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మహాలక్ష్మికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, వడ్డే నారాయణ, హనుమంతరెడ్డి, వాల్మీకి శంకర్, పూజారి పెద్దన్న, ఆవుల అశోక్, రాజారెడ్డి, ఉప సర్పంచి యుగంధర్, దేరంగుల వెంకటరాముడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, విజయ్‌కుమార్, బాబు, చంద్రశేఖర్, నాగేంద్రకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న శ్రీలక్ష్మి, రజనీ ట్రస్టు సభ్యులు

రజనీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం


ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు భోజనం పంపిణీ చేయడం దైవసేవగా భావిస్తున్నామని రజనీ ట్రస్ట్, రక్షాబంధన్ ట్రస్ట్ కన్నా వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని పలుచోట్ల ఆదివారం 80 మంది పేదలు, అనాథలు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 57 రోజులుగా అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సేవాదాత శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు అన్నదానం చేశామన్నారు. ముమ్మందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దాతలు 9731135903, 9391553146లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేతా లోకేష్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల అనుబంధ కమిటీల సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలో వైసిపి అనుబంధ కమిటీల అధ్యక్షులుగా పది మందిని నియమించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ట్రేడ్ యూనియన్, కల్చరల్, వికలాంగులు, తదితర విభాగాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. వారిని స్థానిక ఎస్ఎల్‌వి ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, దాల్‌మిల్లు సూరి, లోచర్ల రాజారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ మండలంలో అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వాల్మీకి శంకర్, హనుమంతరెడ్డి, సంజీవరాయుడు, రామచంద్ర, రఫీ, రామాంజనేయులు, భాస్కర్, గంగప్ప, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మండల వైసిపి అనుబంధ కమిటీల సభ్యులను సన్మానించిన నాయకులు

కొత్తచెరువులో అన్నదానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కొత్తచెరువులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిడిపి మైనార్టీ నాయకులు, ఎక్స్ కో ఆప్షన్ మెంబర్ కె.నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అభిమానులు, మైనార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. నిస్సార్ మాట్లాడుతూ జెసి ప్రభాకర్ రెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బషీర్ అహ్మద్, హరికృష్ణచౌదరి, సనావుల్లా, నిజాం, గుజిరి బాషా, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న టిడిపి నాయకులు నిస్సార్ అహ్మద్

చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రయాణ సమయాల్లో పోలీసులకు సమాచారం ఇవ్వాలి : సిఐ నారాయణరెడ్డి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఏదైనా ఓ కుటుంబం తాము ఊరెళుతున్నట్లు ఫొటో తీసి సోషల్ మీడియాలో పెడుతుంటారని సరదాగా వారు చేసిన ఈ పని వల్ల వారి ఇల్లు గుల్లయ్యే ప్రమాదం ఉందని కదిరి పట్టణ సిఐ నారాయణరెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరుగుతున్న చోరీలు వాటి పర్యావసానాలపై ఆయన వివరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఓ వ్యక్తి ఇరవై సంవత్సరాలు పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ అక్కడ చాలా ఇబ్బందులు ఎదుర్కొని కాయ కష్టం చేసి కొంత మొత్తాన్ని కూడబెట్టి బంగారు ఆభరణాలు కొనుగోలు చేశాడు. ఇటీవల ఒక్కగానొక్క కూతురు వివాహం కుదరడంతో కుమార్తె వివాహానికి బంధువులను ఆహ్వానించడానికి కుటుంబసభ్యులతో కలసి వెళ్లాడు. వారికి ఇంటికి తాళం వేసిన దృశ్యాన్ని పసిగట్టిన దుండగులు కుమార్తె వివాహం కోసం ఉంచిన సొమ్మును దోచుకెళ్లారు. పెళ్లి ముహూర్తం దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఇంతలో అనంతపురం జిల్లాలోని ఓ మండలంలో పోలీసుల తనిఖీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో అన్నమయ్య జిల్లాలో జరిగిన చోరీ ముడి వీడింది. దీంతో పోలీసులు బాధిత కుటుంబానికి సమాచారం ఇచ్చి న్యాయం చేశారు. ఇలాంటి దొంగతనాలు, ఘటనలు పలుచోట్ల జరుగుతుంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ నారాయణరెడ్డి సూచిస్తున్నారు. ప్రజలు తమ ఇళ్లకు తాళం వేసి బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దీని వల్ల పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఉంచుతారన్నారు. అంతేకాకుండా భద్రత కోసం ఇంటికి ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం కూడా ఉత్తమమని అన్నారు. ప్రయాణానికి ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా బయటకు వెళ్లేవారు ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేయకూడదని జాగ్రత్త వహించాలన్నారు. ఏదైనా సమయంలో అనుమానాస్పదముగా తిరిగే వారిని గుర్తించిన ఆ వివరాలను గ్రామ లేదా వార్డు మహిళా పోలీసులకు గాని డయల్ –100, డయల్ 113కు కాని ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురాస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-పెనుకొండ

వాల్మీకి విద్యార్థులు విద్య ప్రాధాన్యతను గుర్తించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురాస్కారాలు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విషయాన్ని మరవరాదన్నారు. భవిష్యత్తులో వాల్మీకి కుటుంబాలకు చెందిన ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చక్కగా చదివించి వారిని ఉన్నత ఆశయంతో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇందుకోసం తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం, వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు విజయకుమార్, శివయ్య, జగదీష్, ఈశ్వయ్య, ముత్యాలప్ప, శివన్న, రామప్ప, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, పురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడమే తమ లక్ష్యం, ప్రాధాన్యత అని శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బివి.రమణ, ఛైర్మన్ దాసరి వెంకటేశులు(చిట్టి) తెలిపారు. పట్టణంలోని శ్రీశాంతకళా చౌడేశ్వరీదేవి ఆలయ ఆవరణలో ఆదివారం 111వ ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, డాక్టర్ డివి.జయదీప్, డాక్టర్ ఎస్.విటల్, డాక్టర్ సాయిశ్వేత 275 మంది రోగులకు వైద్య చికిత్సతో పాటు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల పాటించాల్సిన నియమ నిబంధనలను సూచించారు. పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. చింతా లక్ష్మీనరసమ్మ, చింతా రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారులు చింతా వెంకట రంగయ్య, చింత కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరం నిర్వహించారు. అర్హులకు ప్రతినెలా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ. 200 చొప్పున ఆర్థికసాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణస్వామి, బంధనాథం చిన్నికృష్ణ, సిరివెళ్ల రాధాకృష్ణ, బండి నాగరాజు, మేకల శివయ్య, మామిళ్ల అశ్వర్థనారాయణ, పవన్‌కుమార్, రెడ్డి సాయి, పెద్దకోట్ల భాస్కర్, పెద్దకోట్ల విజయ్ పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా కమిటీలో చోటు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు ఆరుగురికి జిల్లా కమిటీలో చోటు దక్కినట్లు తొగటవీర క్షత్రియ సంఘం మండల అధ్యక్షులు సిసి హరి పేర్కొన్నారు. స్థానిక శ్రీచౌడేశ్వరీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శి టేకూరి శేషాద్రి, జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి గుండా పుల్లయ్య, తదితర ముఖ్యులు పాల్గొన్నారు. హరి మాట్లాడుతూ జిల్లాలో సేవ, అభివృద్ధి కార్యక్రమాల్లో సోమందేపల్లి తొగటవీర క్షత్రియ సంఘం ప్రథమ స్థానంలో ఉందని గుర్తించి మండల సంఘంలోని బండారు శ్రీనివాసులును జిల్లా ఉపాధ్యక్షుడిగా, కేత రిషీశ్వర్‌ను జిల్లా సహాయ కార్యదర్శిగా, బిటిఎన్.జగదీష్, బీరే మారుతి, బండారు గోవింద, బండారు రాజేష్‌లను జిల్లా సంఘంలోకి తీసుకున్నారని తెలిపారు. వారు మాట్లాడుతూ తాము రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడంతో పాటు సేవా, సహాయ కార్యక్రమాలను మరింత ఉత్సాహంతో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పలువురు జిల్లా, మండల సంఘం నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో రంగనగోపాల్, గట్టా మహేంద్ర, షీలా నారాయణస్వామి, తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తొగటవీర క్షత్రియ సంఘం కమిటీ సభ్యులు

అంబేద్కర్ గురుకుల పాఠశాలకు దొడగట్ట విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని దొడగట్ట ఎంపియుపి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం హరీష్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి గత ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఎన్.హేమంత్, అనన్య, జి.నిహారిక ప్రతిభ చాటి సీట్లు సాధించారని తెలిపారు. వారిలో హేమంత్ హిందూపూరం బాలుర పాఠశాలకు, అనన్య హిందూపురం బాలికల పాఠశాలకు, నిహారిక తిరుపతి వద్ద ఉన్న సూళ్లూరుపేటలో పాఠశాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎవరు ఎక్కడ జాయిన్ కావాలో శనివారం వారికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు, అందుకు విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను హెచ్‌ఎంతో పాటు ఎస్ఎంసి ఛైర్మన్ నరసింహమూర్తి, వైస్ ఛైర్‌పర్సన్ సుకన్య, సభ్యులు, ప్రజలు అభినందించారు.



అనన్య



ఎన్.హేమంత్



జి.నిహారిక

టిడిపి మహానాడును విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే టిడిపి మహానాడులో ముస్లిం మైనారిటీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ముస్లిం మైనార్టీ టిడిపి విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. టిడిపి మొదటి నుంచి ముస్లిం లకు పెద్దపీట వేస్తోంద న్నారు. ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింద న్నారు. రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. కడపలో జరిగే మహానాడులో ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం పలు తీర్మానాలు ప్రవేశపెడతారన్నారు. టిడిపి హయాంలో షాదీఖానా నిర్మించారని, మసీదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిందని, రంజాన్ తోఫా, దుల్హన్, విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతో ప్రోత్సాహం అందించిందన్నారు. గత వైసిపి పాలనలో ఆయా పథకాలను రద్దు చేసి ముస్లింలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్ కార్మికుల దీక్ష

ప్రజాశక్తి-గాండ్లపెంట

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛభారత్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్టాప్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన ఆదివారం శిబిరంలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు అక్కులప్ప మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల స్వచ్ఛభారత్ కార్మికులకు సుమారు 30 నెలల నుంచి వేతనాలు అందలేదలేద న్నారు. దీంతో కార్మికులకు కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు అంజి, శ్రీరాములు, వెంకటయ్య, కదిరప్ప, గంగులప్ప, పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ సంఘం కమిటీ ఏర్పాటు

చిలమత్తూరు : స్థానిక చౌడమ్మ దేవాలయంలో ఆదివారం తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గుండా పుల్లయ్య, కార్యదర్శులుగా టి.శేషాద్రి, దాసరి శ్రీనివాసులు, యుగంధర్‌లను నియమించారు. సంఘం ఆదర్శ మార్గంలో సాగాలని, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అభివృద్ధికి కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నారాయణస్వామి, ఆదిమూర్తి, పూజారి చౌడప్ప, చంద్ర, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరీదేవి ఆలయానికి గ్రానైట్ వితరణ

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని బట్రేపల్లిలో శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం, శివాలయం పునర్నిర్మాణ పనులు చేప ట్టారు. ఈ క్రమంలో శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు మండలంలోని పూలవాండ్లపల్లి గ్రామానికి చెందిన మైనింగ్ శాఖ ఎడి బి.రామచంద్ర వారం రోజుల క్రితం ఆలయాన్ని సందర్శించి ఆలయానికి అవసరమైన గ్రానైట్ సమకూరుస్తానని ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం ఆలయానికి గ్రానైట్‌ను పంపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని గుండువారిపల్లి పంచాయతీ పరిధిలోని గాజులపల్లి వద్ద ఉన్న శ్రీమాతశ్రీ వృద్ధాశ్రమానికి ఆదివారం అనంతపురం నగరానికి చెందిన చల్లా సర్జికల్స్ ఎండి చల్లా రాజశేఖర్, అతని తమ్ముడు సైంటిస్ట్ చల్లా చంద్రశేఖర్ రూ. 15వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆశ్రమానికి తన వంతు సాయం చేస్తానని వారు తెలిపారు. వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ్‌జ్యోతి మాట్లాడుతూ జయరామ్, చల్లా రాజశేఖర్, చల్లా చంద్రశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప

జిల్లా మినీ మహానాడు విజయవంతం

టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో గత శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి మినీ మహానాడు విజయవంతంగా ముగిసిందని టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు మహానాడులో పాల్గొని టిడిపి బలం ఏంటో నిరూపించారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు పండుగలో పసుపు సైనికులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచి ఎం.చంద్రశేఖర్, నాయకులు శంకర్, వెంకటరాముడు, వెంకటసుబ్బయ్య, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్‌లో చేతబడి కలకలం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో చేతబడి కలకలం రేగింది. కాలనీకి చెందిన షాను అనే మహిళ ఇంటి ముందు బొమ్మలు, ఎముకలు, కుంకుమ, నిమ్మకాయలు తదితర వాటిని గుర్తుతెలియని వ్యక్తులు పెట్టారు. అది గమనించిన షాను భయాందోళనకు గురైంది. ఇదిలా ఉండగా చేతబడి కలకలంపై జెవివి జిల్లా ఉపాధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడారు. చేతబడులు, క్షుద్రపూజలు అన్నీ బూటకమన్నారు. ఇలాంటివన్నీ ఎవరూ నమ్మకూడదన్నారు. ఎవరైన కాని వారు మహిళను భయపెట్టడానికి చేసి ఉంటారన్నారు. ఆధునిక యుగంలో కూడా ఇలాంటి వాటితో కొందరు భయపెడుతున్నారన్నారు. మూఢనమ్మకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.



వీరజవాను తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న కోడూరు యూత్ సభ్యులు

వీరజవానుకు నివాళి

ప్రజాశక్తి-చిలమత్తూరు

వీరజవాను మురళీనాయక్ జ్ఞాపకార్థం మండలంలోని కోడూరు యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. టోర్నీలో 50కు పైగా జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ నెల 29వ తేదీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా కోడూరు యూత్ సభ్యులు కళ్లితండా గ్రామం వెళ్లి వీరజవాను మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఫైనల్ మ్యాచ్‌కు హాజరుకావాలని మురళీనాయక్ తల్లిదండ్రులను ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగి ప్రవీణ్ కుమార్, రామచంద్ర, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

శాఖాహార ర్యాలీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక శ్రీహరిహర పిరమిడ్ ధ్యానమందిరం ఆధ్వర్యంలో ఆదివారం బత్తలపల్లిలో మహాకరుణ శాఖాహార ర్యాలీ చేపట్టారు. ఉదయం సుమారు 600 మందితో ప్రారంభమైన ర్యాలీ ధ్యాన మందిరం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకూ సాగింది. ప్లకార్డులు చేతబట్టి జీవహింస మహా పాపం అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు కొట్టాల ప్రభాకర్, ధర్మవరం రమాదేవి, వెంకటరెడ్డి, నాగేంద్రమ్మ దంపతులు ధ్యాన సందేశం వినిపించారు. ర్యాలీలో పాల్గొన్న వారికి మాల్యవంతం సీనియర్ పిరమిడ్ ధ్యానం మాస్టర్ వెంకటనారాయణ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, నాయుడు, కొండన్న, గోపాల్, ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

'యోగా వల్ల ఆరోగ్యం'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యోగా వల్ల చక్కటి ఆరోగ్యంతో పాటు మనశ్శాంతి కూడా లభిస్తుందని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకూ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో రోజూ ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకూ యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొంటున్నారని తెలిపారు. షుగర్, బిపి, నొప్పులు ఉన్న వారు యోగాసనాలు వేయడం వారి ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు.

'గెస్ట్ టీచర్' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పావగడ

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్నాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అసోసియేషన్‌లో పావగడ తాలూకాలోని 8 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల(గెస్ట్ టీచర్) భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మొరార్జీ పాఠశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత పత్రాలను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పళవళ్లి గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సమర్పించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

బాగా చదివితే జీవితంలో ఏదైనా సాధ్యం

ప్రజాశక్తి-పావగడ

బాగా చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి వెంకటయ్య సూచించారు. సూరపనేని విద్యాసాగర్ ఫౌండేషన్, హెల్ప్ సొసైటీ ఆఫ్ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. వెంకటయ్య మాట్లాడారు పేద పిల్లలకు విద్యనందించేందుకు ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిం చిందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూరపనేని విద్యాసాగర్, జాయింట్ డైరెక్టర్ నగేష్, ఏఈఈ మహదేవప్ప, గురుకుల ఎన్‌సి నాగభూషణ్, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు శశికిరణ్, నరేష్, తాలూకాలోని 8 రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపళ్లు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంగమునిస్వామి సన్నిధిలో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ : మండలంలోని టిఎన్.పాల్యం గ్రామంలో వెలసిన శ్రీవెంగముని స్వామి ఆలయాన్ని ఆదివారం ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే టిడిపి కార్యకర్త గోపాల్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. శ్రీరామ్ వెంట సీనియర్ నాయకులు రమేష్‌బాబు, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, నరసింహయాదవ్, వినోద్ బాబు, కార్యకర్తలు ఉన్నారు.

ఏలుకుంట్లలో ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం రూరల్ : మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో ఆదివారం ఇరు వర్గాల వారు ఘర్షణ పడినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆ ఘర్షణలో ఓ వర్గానికి చెందిన విజయ్‌చౌదరి, శ్రీనివాసులు, అప్పస్వామి, లక్ష్మీనారాయణ, మరో వర్గానికి చెందిన బొగ్గు నాగరాజు, దామోదర్, సత్యమయ్య, ఓబుళమ్మ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన విజయ్, అప్పస్వామిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఇరువైపుల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘర్షణలో గాయపడిన వారిని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

పెనుకొండ : విద్యుదాఘాతంతో చిన్నారి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని వెంకటాపురం తండా వద్ద ఉన్న ఈశ్వర్ రబ్బరు ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా ఆతూరు తాలూకా మల్లీయకరై గ్రామానికి చెందిన అశోక్ ఈశ్వర్ రబ్బరు ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అతడు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. విధుల నిమిత్తం ఆదివారం సాయంత్రం అశోక్ ఫ్యాక్టరీకి వెళ్లాడు. ఇంట్లోనే ఉన్న అశోక్ భార్య నీరు వేడి చేసేందుకు బకెట్‌లో హీటర్ ఉంచింది. వారి పెద్ద కుమార్తె సెల్వ మౌనిక(7) ఆడుకుంటూ బాత్‌రూం వైపు వెళ్తుండగా తల్లి గమనించి ఆపేందుకు వెళ్లింది. అంతలోనే చిన్నారి బకెట్లో చేయి పెట్టడంతో నీరు కింద పడి విద్యుత్ సరఫరా అయింది. తల్లి స్విచ్ ఆఫ్ చేసే లోపు మౌనిక విద్యుత్ షాక్‌కు గురైంది. వెంటనే చిన్నారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తల్లి గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.